## కుల గణన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలి

### నల్లా సూర్య ప్రకాశ్

చిక్కడపల్లి, మే 30 : కుల గణన అనంతరం బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'స్థానిక ఎన్నికలు– బీసీ రిజర్వేషన్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదోగోని రవి, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీసీ డిక్లరేషన్ ద్వారా చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల గణ అంనతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో జనాభా దాదాపు 65 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం వాటా లేకుండా రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనేది అసాధ్యమైన విషయమని అన్నారు. ఈ సమావేశంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వాతలు, ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు వెంకట స్వామి,డి.రాజేశ్‌లు, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగించే నిర్ణయం విచారకరం

## చార్మినార్ వద్ద బీఆర్ఎస్ ధర్నాకు తరలివెళ్లిన నాయకులు

అబిడ్స్, మే 30 : చార్మినార్, వరంగల్‌లోని కాకతీయ కళా తోరణాలను తెలంగాణ రాజముద్రలోంచి తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అశీష్‌కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఇచ్చిన పిలుపు మేరకు చార్మినార్ వద్ద గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేటీఆర్ నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న అశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించడమంటే ప్రతి హైదరాబాద్ వాసిని అవమానపర్చినట్లే అన్నారు. తెలంగాణ వారసత్వ సంపద సంస్కృతికి చిహ్నాలు చార్మినార్, కాకతీయ కళాతోరణాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటిగోపీనాథ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● మెహిదీపట్నం : తెలంగాణ రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళావైభవం, చార్మినార్‌లను తొలగించడంపై బీఆర్ఎస్ పార్టీ గురువారం చార్మినార్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుతో కలిసి పార్టీ నాయకులు కోడూరి శ్రీధర్‌సాగర్, అబ్దుల్ కలీం, యాద శ్రీనివాస్ గుప్తా, కృష్ణదాస్, పట్లూరి రఘు, తదితరులు పాల్గొన్నారు.



చార్మినార్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు చార్మినార్ జ్ఞాపికను అందజేసి స్వాగతం పలుకుతున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అశీష్‌కుమార్‌యాదవ్, యువ నాయకుడు పంకజ్ షిండే తదితరులు

చార్మినార్ వద్ద నిర్వహించిన ధర్నాలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుతో కలిసి పాల్గొన్న కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలు శ్రీధర్‌సాగర్, యాద శ్రీనివాస్‌గుప్తా

చార్మినార్ వద్ద ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవరం నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

## కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారు

సుల్తాన్‌బజార్ : మాజీ సీఎం కేసీఆర్ ముద్రించిన రాజముద్రలోని కాకతీయ కళా తోరణాన్ని, చార్మినార్‌ను తొలగించడం తెలంగాణను అవమానపర్చడమేనని గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు యాద శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు చార్మినార్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును గాలికి వదిలేసి ప్రభుత్వ రాజముద్ర, చిహ్నాన్ని మారుస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న తప్పుడు చర్యలను ఇకపైనా మానుకోవాలని అన్నారు. ఒంటెద్దు పోకడ పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్‌వీ మహేందర్, నాయకులు పట్లూరు రఘు, శ్రీధర్ సాగర్, క్రిష్ణాదాస్, రాములు, కుమార్ పాల్గొన్నారు.

ధర్నా కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గ్రేటర్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు యాద శ్రీనివాస్‌గుప్తా, ఆర్‌వీ మహేందర్

# మా బస్తీలో ప్రైవేటు పాఠశాల వద్దు

## మూకుమ్మడిగా నిరసన తెలిపిన తిలక్‌నగర్ వాసులు



ప్రైవేటు పాఠశాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న తిలక్‌నగర్ వాసులు

అంబర్‌పేట, మే 30 : నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ స్ట్రీట్ నంబర్ 15లో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు పాఠశాల ఏర్పాటును బస్తీవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలను ఏర్పాటు చేసే భవనం వద్ద తిలక్‌నగర్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎస్. ప్రసాద్, జనార్దన్, శివ, శ్రీకాంత్, హరి, రాజమ్మ, రాధిక తదితరులు మాట్లాడుతూ.. తమ బస్తీలో 17 ఇండ్లు ఉన్నాయని, ఇంతకు ముందే ఒక స్కూల్ కూడా ఉందని చెప్పారు. ఆ స్కూల్ విద్యార్థులు వెళ్లడానికి రోడ్డు ఉందని, కానీ ఇప్పుడు ఏర్పాటు చేస్తామంటున్న స్కూల్ భవనానికి ఎలాంటి రోడ్డు లేదని, డెడ్ ఎండ్‌లో ఏర్పాటు తగదన్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని, ప్రస్తుత బిల్డింగ్‌కు వెంటిలేషన్, ఫైర్‌సేఫ్టీ, ప్లేగ్రౌండ్ వంటి సౌకర్యాలు ఏవీ లేదని చెప్పారు. రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ కార్యక్రలాపాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అందరి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే పాఠశాల అనుమతిని రద్దుచేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వాణి, రాణి, ధన్‌రాజ్, దీపక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో కృషి చేస్తే సివిల్స్‌లో విజయం

చిక్కడపల్లి, మే 30 : సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించవచ్చునని సివిల్స్ 36వ ర్యాంకర్ అయుషి ప్రధాన్ అన్నారు. రాథోడ్స్ ఐఏఎస్ అకాడమీ 5 సంవత్సరాల నుంచి ఆన్‌లైన్‌లో సివిల్స్ అభ్యర్థులకు క్లాసెస్ ఇవ్వడం జరుగుతుంది. గురువారం ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్‌లో ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభత్సోవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త అనుమల తిరుపతిరెడ్డి, ర్యాంకర్ ఆయుషి ప్రధాన్, ఐఏఎస్ అధికారి శరత్, తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసీ వసంతరెడ్డి తదితరులు హాజరై ప్రారంభించారు. అనంతరం అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పలు సూచనలు చేశారు. డైరెక్టర్లు ఉషశ్రీ, శ్యామ్‌రాథోడ్, సీతారామం రాథోడ్, ఫ్యాకల్టీలు రమేశ్, రేవా, సురేంద్ర పాల్గొన్నారు.

## నగర ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం

నగర ఫొటోగ్రాఫర్ అండేకార్ సతీశ్‌లాల్‌కు రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ అత్యున్నత పురస్కారం ప్రదానం చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ రంగంలో అందిస్తున్న రెండవ అత్యున్నత పురస్కారం ఇది. పది సంవత్సరాలుగా ఒడిస్సాలో అలివ్ రిడ్లీ తాబేళ్ల జీవన విధానంపై, వాటికి మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న ముప్పుపై అండేకార్ సతీశ్‌లాల్ చేసిన ఫొటో డాక్యుమెంటేషన్‌ను రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ వారికి సమర్పించారు. ఈ ఫొటోగ్రఫీని పరిశీలించిన సొసైటీ వారు సతీశ్‌లాల్‌కు హానర్ పురస్కారంతో సన్మానించారు.

– మెహిదీపట్నం, మే 30

## ఉచిత విద్యా, వైద్యాన్ని అందించాలి

చిక్కడపల్లి, మే 30 : ప్రజలందరికీ ఉచిత విద్యా, వైద్యాన్ని అందించాలని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ పిలుపు నిచ్చారు. గురువారం దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్)4వ మహాసభను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చెస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేటర్ చైర్మన్ నాగపురి ప్రీతం, కేంద్ర విద్యాలయం ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ, సామాజిక కార్యకర్త కె.సజయ, డీబీఎఫ్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేళనం భ్యాగ్యరావు, జాతీయ కార్యదర్శి పి.శంకర్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, రాయదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ ప్రొఫెసర్ స్కేల్ ఇవ్వాలని వినతి

మెహిదీపట్నం, మే 30 : సీనియర్ ప్రొఫెసర్ స్కేల్ ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కపిలవాయి శ్రీనివాస్ రాజు ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ర్యాంకులో క్రెడిబిలిటీ 14లో ఉన్నారని, 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి సీనియర్ ప్రొఫెసర్ ర్యాంకులో 15 వ కేటగిరి వర్తింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

## మాలకుంట నాలాలో పూడికతీత పూర్తి

అబిడ్స్, మే 30 : రాబోయే వర్షాకాలంలో వర్షం నీరు సాఫీగా పోయేందుకుగాను నగరంలోని నాలాలలో పూడికతీత పనులను చేపడుతున్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని మాలకుంట నాలాలో పేరుకు పోయిన చెత్త, మట్టి పూడికతీతను పూర్తి చేశారు. ఖైరతాబాద్ జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ నేతృత్వంలో నాలాల పూడికతీత పనులను చేపడుతున్నారు.

## సీవరేజీ పనులు పూర్తి చేయండి

మెహిదీపట్నం, మే 30 : మల్లేపల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సీవరేజీ లైన్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ జల మండలి ప్రాజెక్ట్ జీఎం మూర్తిని కోరారు. ఈ మేరకు రెడ్‌హిల్స్‌లోని జీఎం కార్యాలయానికి వెళ్లి ప్రజలకు ముంపు ప్రమాదం లేకుండా చూడాలని కోరారు.

## ముగిసిన ఝాంసింగ్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అబిడ్స్, మే 30 : చారిత్రాత్మకమైన ఝాంసింగ్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ సింగ్, ఈఓ బి. కృష్ణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అంబారిపేట శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో ఈ నెల 24వ తేదీన ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నాటితో ముగిశాయి. ప్రతి నిత్యం స్వామి వారికి పూజలు నిర్వహించగా ఈ నెల 26వ తేదీన స్వామి వారి శేషవాహన సేవ, 27వ తేదీన శ్రీవారి మోహిని సేవ కార్యక్రమాలను నిర్వహించగా 28వ తేదీన స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అదే రోజు రాత్రి శ్రీవారి దివ్య బ్రహ్మ రథోత్సవ కార్యక్రమం కనుల పండుగగా సాగింది. చివరి రోజైన గురువారం అర్చనలు, అర్జిత సేవలు, సాయంత్రం శ్రీవారి శృంగార డోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

## గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి..

### నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మే 30: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యదర్శి ఏర్పుల ప్రసాద్(34) గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం అర్ధరాత్రి భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో ఉండగా చాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందారు. డాక్టర్లు పరిశీలించి గండెపోటుతో మృతి చెందాడని వెల్లడించారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు బౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని ఆదు కుంటామని ఎమ్మెల్యే అన్నారు. ప్రసాద్ అంత్యక్రియలు స్థానికంగా ఉన్న శ్మశానవాటికలో నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## పీఈటీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

కవాడిగూడ, మే 30 : దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యూకేషనల్ కళాశాలలో 1994–95 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం గురువారం జరిగింది. 30 ఏండ్ల తరువాత వారంతా ఒకచోట కలుసుకున్నారు. ఒకరి నొకరు ఆత్మీయంగా పలకరిచంపకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్యకారణాల వల్ల మృతి చెందిన తోటి స్నేహితులను గుర్తు చేసుకొని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్ర మంలో పూర్వ విద్యార్థులు అర్చన శ్రీధర్, బుజ్జీ, ఉపేందర్, తబిత, ప్రమీల భిక్షపతి, సుధీర్, ఆదర్శ్, నరేందర్, సింహాద్రి నాయుడు, మసూద్ , జరీనా, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, చంద్రశేఖర్, జగన్ పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీకూచిపూడి డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవాలు

రవీంద్రభారతి, మే 30 : శ్రీలక్ష్మి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 5వ వార్షికోత్సవాలు గురువారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, శ్రీలక్ష్మి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు కూచిపూడి నాట్యగురువు ఎ. అనుదీప్తి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ఆమె శిష్య బృందంచే కూచిపూడి డ్యాన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం అతి ప్రాచీన నృత్యం అని, ఎందరో గొప్ప మహనీయులు కూచిపూడి నృత్యాన్ని నేర్చుకొని గొప్ప నాట్యగురువులు, నాట్యకళాకారులుగా దేశ విదేశాలలో ప్రసిద్ధి చెందారని కొనియాడారు. అనంతరం డ్యాన్స్ అకాడమీ విద్యార్థులచే కూచిపూడి నృత్యప్రదర్శన వీక్షకులను అలరించింది. నాట్యగురువు డా.పి.జాన్సీ రామ, డా.అనూహ్యరెడ్డి, విజయ శంకరస్వామి, ఎన్.సోమయ్య, పీఎన్. మూర్తి పాల్గొన్నారు.

## ముగిసిన మేరు సంఘం నామినేషన్ ఫారాల గడువు

అబిడ్స్, మే 30 : తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలు జూన్ 30న జరగనున్న నేపథ్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న నామినేషన్ ఫారాల కొనుగోలు గురువారం ముగిసిందని రాష్ట్ర ఎన్నికల అధికారులు సురేశ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకులు జగదీశ్ చందర్ తెలిపారు. 11 మంది వివిధ ప్యానల్‌లకు చెందిన వారు నామినేషన్ ఫారాలు తీసుకున్నారని తెలిపారు. జూన్ 13 నుంచి 16 వరకు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందన్నారు. గురువారం సంఘం రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ మాజీ కన్వీనర్ వెంకటేశ్వర రావు ప్యానల్ సభ్యులు నామినేషన్ పత్రాలు, ఓటర్ల జాబితా తీసుకున్నారు.

# చేప మందు పంపిణీ విజయవంతానికి సహకరించాలి

సుల్తాన్‌బజార్, మే 30 : అస్తమా రోగుల కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే చేప మందు పంపిణీ విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఏఆర్ హెడ్‌క్వార్టర్ జాయింట్ సీపీ సత్యనారాయణ, సెంట్రల్ జోన్ డీసీపీ అక్షంక్షయాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మత్స్యశాఖ, ఆర్‌అండ్‌బీ, జలమండలి, విద్యుత్ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల అధి కారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. దేశం లోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది అస్తమా రోగులు, వారి సహాయకులు తరలివచ్చి చేప మందు ప్రసాదాన్ని స్వీకరిస్తారని అన్నారు. చేప మందు కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. జూన్ నెల 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున అప్పటి వరకు మైదానంలో ఎటువంటి ఏర్పాట్లకు అనుమతి లేదని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం 5వ తేది నుంచి ఏర్పాట్ల పనులకు అనుమతి ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇదిలా ఉండగా దేశం లోని వివిధ రాష్ట్రాల నుంచి ముందుగా వచ్చే ప్రజలకు 6వ తేది నుంచి ఎగ్జిబిషన్ మైదానంలో ఉం డేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. మత్స్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా చేపలను పంపిణీ చేస్తారు. ప్రసాదం స్వీకరించిన వారు సురక్షితంగా వెళ్లే విధంగా అన్ని చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ బి. ఆనంద్, అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, ట్రాఫిక్ డీసీపీ, గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ, గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, ఎస్‌బీ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ, మత్స్యశాఖ, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, ఈఎంఆర్ఐ తదితర ప్రభుత్వ శాఖల అధి కారులు పాల్గొన్నారు.

వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఏఆర్ జాయింట్ సీపీ సత్యనారాయణ, సెంట్రల్ జోన్ డీసీపీ అక్షంక్ష్ యాదవ్ తదితరులు

### ఎన్నికల కౌంటింగ్ ముగిసిన అనంతరమే ఏర్పాట్లకు అవకాశం..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రెండు నియోజకవర్గాలకు చెందిన డీఆర్‌సీ కొనసాగుతుంది. కాగా ఈ నెల 8న బత్తిని హరినాథ్, సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించే చేప ప్రసాదం పంపిణీకి అనుమతి ఉన్నప్పటికీ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఏర్పాట్లకు పోలీసులు అనుమతివ్వలేదు. జూన్ 5వ తేది అనంతరమే ఏర్పాట్లు ప్రారంభం చేసుకోవాలని పోలీసులు నిర్వాహకులకు సూచించారు. కాగా ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల సమన్వయంతో కేవలం మూడు రోజులలోనే బారీకేడ్లు, చేపల టిక్కెట్ కౌంటర్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఇదిలా ఉండగా ప్రతి ఏడాది దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అస్తమా రోగులు చేప ప్రసాదం కోసం వారం ముందుగానే ఎగ్జిబిషన్ మైదానం చేరుకుంటారు. కానీ ఎన్నిలక కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో పోలీసులు 5 వరకు ఎవరినీ అనుమతించే ప్రసక్తే లేదని తెలుపుతున్నారు. ఐతే 6 నుంచి ఇతర రాష్ట్రాల ప్రజలకు ఎగ్జిబిషన్ మైదానంలోకి అనుమతిస్తారు.

## తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

రవీంద్రభారతి, మే 30 : తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి గొప్ప సాహితివేత్త అని ఆయన రచనలు నేటి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్. బాలాచారి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళాసమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య కళాపీటం, లక్ష్య సాధన ఫౌండేషన్ల ఆధ్వర్యంలో తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు గురువారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా డా.ఎన్. బాలాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేసి సురవరం ప్రతాపరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికను స్థాపించి నిజాం నిరకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాసాలు రాసి తెలంగాణ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప తెలంగాణ పోరాటయోధుడని కొనియాడారు. తెలంగాణలో కవులేలేరని చెప్పే సమయంలో తన పత్రిక ద్వారా అనేక కవితలను రాసి తెలంగాణ కవులకు స్ఫూర్తిదాయంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్, ప్రతాప్‌రెడ్డి కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలి

కవాడిగూడ, మే 30: వెనకబడిన తరగతుల స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని కోరుతూ వివిధ వృత్తి సంఘాల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేము నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. వృత్తి సంఘాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన వేము నరేందర్‌రెడ్డి స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైనదని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చిట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎం. బాగయ్య, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య